పోలింగ్‌కు పకడ్బందీ చర్యలు

- వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి
- వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి
- పోలింగ్ కేంద్రం తనిఖీ
- వికారాబాద్‌లో 5కే రన్

కొడంగల్, మార్చి 27 : పోలింగ్ పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్పీ కోటిరెడ్డితో కలిసి పట్టణంలోని కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటైన పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పోలింగ్ కేంద్రంలో తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలు, ఏర్పాట్లపై పలు సూచనలు, సలహాలను అందించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రంలోని ఓటర్ల జాబితా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికకు సంబంధించి కొడంగల్ నియోజకవర్గంలో మొత్తంగా 56 మంది ప్రజాప్రతినిధులు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలు చేయాలని.. ఓటర్లు, పోలింగ్ సిబ్బంది, అధికారులను మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలని సూచించారు. పోలింగ్ కేంద్రం ఎదుట, చుట్టుపక్కల పూర్తిస్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరా ఏర్పాట్లతోపాటు విధిగా వీడియో ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రంలోని సమాచారాన్ని చేరవేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కొనసాగుతున్న పది పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. ఎటువంటి మాస్ కాపీయింగ్ జరుగకుండా చర్యలు తీసుకోవాలని, సెంటర్‌లో అబ్జెక్టివ్ టైప్ చెప్పడం వంటివి జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. గతంలో ఈ మాదిరిగా జరిగిన సమాచారం ఉందని, కాబట్టి ప్రత్యేకంగా పరిశీలన చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

'కడా' కార్యాలయంలో..

అనంతరం కడా కార్యాలయంలో ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, మిషన్ భగీరథ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆంజనేయులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేశ్వర్‌రావు, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. బోర్ మోటర్లు, చేతి పంపులన్నింటికీ మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరాకు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఉన్నవాటితో గడిపేద్దామని నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. అనివార్య కారణాల వల్ల మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోతే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి సమృద్ధిగా తాగునీటిని సరఫరా చేసేలా కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని సూచించారు. పంచాయతీరాజ్ అధికారుల సమన్వయంతో మంచినీటి సమస్య తల్తెకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో ఉషశ్రీ, మున్సిపల్ కమిషనర్ బలరాం, వ్యవసాయాధికారి శంకర్‌రాథోడ్, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో రాములు, సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ పాల్గొన్నారు.

కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలి

వికారాబాద్ : ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు I VOTE FOR SURE నినాదంతో పట్టణంలో ఎన్నెపల్లి చౌరస్తా నుంచి అలంపల్లి చౌరస్తా వరకు ఏర్పాటు చేసిన 5కే రన్‌ను ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికల కోసం ఓటర్ కార్డుల సవరణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పక ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకుగాను ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కు ఉన్నవారు ముందుగానే ఓటర్ జాబితాలో ఓటు ఉందా లేదా అని ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవాలన్నారు. కులమతాలకు అతీతంగా డబ్బు, మద్యం, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలి

ఓటింగ్ శాతం పెంచడానికి 'స్వీప్' కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, పార్లమెంటు ఎన్నికల్లో జిల్లాలో 80 శాతం ఓటింగ్ పెరిగేలా అందరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ కోటిరెడ్డి సూచించారు. అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ.. 'నేను తప్పక ఓటు వేస్తాను' అనే కార్యక్రమం నిర్వహించడం వల్ల ప్రతి ఒక్కరికీ ఓటు హక్కుపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి సత్తార్, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, అన్ని కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రీ పోలింగ్‌కు ఆస్కారం లేకుండా

ఎన్నికలు నిర్వహించాలి

రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : రీ పోలింగ్‌కు ఆస్కారం లేకుండా ఎన్నికల విధులను పూర్తి అవగాహనతో, ఎలాంటి పొరపాట్లు జరుగకుండా సజావుగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో కలెక్టర్ శశాంక అధ్యక్షతన జిల్లా, నియోజకవర్గస్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మాస్టర్ ట్రైనర్లు ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. నియోజకవర్గస్థాయిలో ప్రిసైడింగ్ అధికారులకు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చేటప్పుడు వారి సందేహాలను నివృత్తి చేయాలని, డీఎల్ఎంటీ, ఏఎల్ఎంటీలు కూడా శిక్షణలోని ప్రతి అంశంపై పట్టు కలిగి ఉండాలన్నారు. శిక్షణకు హాజరయ్యే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు తప్పనిసరిగా క్యూఆర్ కోడ్ ద్వారా హాజరు తీసుకోవాలని సూచించారు. అధికారులకు సరైన శిక్షణ ఇవ్వకపోతే తప్పులు జరిగే అవకాశం ఉంటుందని, మాక్ పోల్ నిర్వహణ, ఈవీఎం ఆపరేట్ చేయడం, ప్రిసైడింగ్ అధికారుల విధులు, బాధ్యతలను, ప్రీ పోల్, పోలింగ్ తర్వాత చేయాల్సిన పనులను విడమర్చి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌వో సంగీత, డీఈవో సుశీందర్‌రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమానికి హాజరైన జిల్లాస్థాయి, నియోజకవర్గస్థాయి మాస్టర్ ట్రైనర్లు

సాంకేతికతను సంతరించుకుంటున్న

రైతు వేదికలు

- అన్నదాతలకు వ్యవసాయ సమాచారం కోసం వీడియో కాన్ఫరెన్స్‌కు ఏర్పాట్లు
- రంగారెడ్డి జిల్లాలో 5 రైతు వేదికల్లో ఈ సదుపాయం

మొయినాబాద్, మార్చి 27 : సాగుబడిలో రైతులకు సూచనలు, సలహాలు అందించేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు వేదికలు మరింత సాంకేతికతను సంతరించుకున్నాయి. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో రైతులు నేరుగా మాట్లాడేందుకు వీడియో కాన్ఫరెన్స్ సిస్టంను ఏర్పాటు చేశారు. రైతులతో సమావేశాలు నిర్వహించి పంటల సాగుపై సమగ్ర సమాచారం అందించి.. వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దేందుకు నాటి ప్రభుత్వం మండలానికి రెండు నుంచి నాలుగు రైతు వేదికలను ఏర్పాటు చేసింది. శిక్షణా కార్యక్రమాలు, సాగు సమస్యలను చర్చించడం కోసం వీడియో కాన్ఫరెన్స్ సిస్టంను ప్రవేశపెట్టారు. దీని ద్వారా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు అందించే పంటల సాగు, పంటల సమస్య సంరక్షణ చర్యల గురించి తెలుసుకోవచ్చు. రైతులు నేరుగా వారితో మాట్లాడే అవకాశముంది. రంగారెడ్డి జిల్లాలో 5 రైతు వేదికల్లో వీడియోకాన్ఫరెన్స్ సదుపాయం ఉన్నది.

ఆధునీకరణ దిశగా రైతు వేదికలు

రంగారెడ్డి జిల్లాలో 83 రైతు వేదికలను గత ప్రభుత్వం నిర్మాణం చేపట్టి ఆధునీకరించారు. జిల్లాలో 5 నియోజకవర్గాలుండగా నియోజకవర్గానికి ఒక రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేశారు. చేవెళ్ల నియోజకవర్గంలో మొయినాబాద్, రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మల్కారం, మహేశ్వరం నియోజకవర్గంలో కందుకూరు, ఇబ్రహీంపట్నం నియోజవర్గంలో మంచాల, షాద్‌నగర్ నియోజకవర్గంలో కొత్తూరు రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ సిస్టంను ఏర్పాటు చేశారు. ఒక్కో సిస్టంకు గత ప్రభుత్వమే రూ.3.75 లక్షల చొప్పున మంజూరు చేసింది. ఈ నిధులతో వేదికల్లో 65 ఇంచుల ఎల్ఈడీ సెట్, ఇన్వర్టర్, సౌండ్ బాక్స్‌లు, సెటప్ బాక్స్‌లు, ఇతర సామగ్రి అమర్చారు. ఈ వేదికల నిర్వహణ కోసం ప్రతి నెలా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసే ప్రణాళికలను సైతం రూపొందించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ ఆధీనంలోని టీ ఫైబర్ నెట్‌వర్క్‌ను వినియోగించుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రైతు వేదికల్లో అధికారులు ట్రయల్ రన్ కూడా చేశారు. సదుపాయం అమలులోకి వచ్చిన తరువాత ప్రతి మంగళవారం రైతు నేస్తం పేరుతో వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు నేరుగా రైతులకు పంటల సమస్యలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇలాంటి విధానం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి చెప్పారు.

రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్న అధికారులు

చెక్కు అందజేత

వికారాబాద్, మార్చి 27 : తాండూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ గత సంవత్సరం ఎస్ఐ గంగయ్య అనారోగ్యంతో చనిపోయాడు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులకు భద్రత నుంచి వచ్చిన రూ.16 లక్షల చెక్, విడో ఫండ్ నుంచి వచ్చిన రూ.10వేల చెక్‌లను బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కోటిరెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసి రిటైర్డ్ అయిన అధికారులు.. వారి కుటుంబ సభ్యులు, ఏదైనా కారణాలతో పనిచేస్తూ చనిపోయినా వారి కుటుంబ సభ్యులు ఎప్పటికీ పోలీస్ డిపార్ట్‌మెంట్ కుటుంబంలో సభ్యులే అన్నారు. ఎల్లప్పుడూ పోలీస్ కుటుంబ సభ్యులకు అండుబాటులో ఉంటామన్నారు. సమస్యలు, ఇబ్బందులుంటే నేరుగా కలిసి చెప్పుకోవచ్చని ఎస్పీ పేర్కొన్నారు.

ఎస్ఐ గంగయ్య కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అభివృద్ధి పథంలో సంఘాలను నడిపించాలి

దోమ, మార్చి 27 : మండల మహిళా సమాఖ్యను అభివృద్ధి పథంలో నడిపించి.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వికారాబాద్ డీఆర్‌డీఏ డీపీఎం రాంమూర్తి, అడిషనల్ డీఆర్‌డీవో సరోజ అన్నారు. బుధవారం దోమ మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో మహిళా సమాఖ్య ఈసీ సమావేశం నిర్వహించగా.. డీఆర్‌డీఏ డీపీఎం, అడిషనల్ డీఆర్‌డీవో హాజరై మహిళా సమాఖ్య అభివృద్ధిపై పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా సమాఖ్య పూర్తి బాధ్యత ఈసీ సభ్యులు తీసుకొని.. సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రతి అంశంపై సమష్టిగా చర్చించి అభివృద్ధి పథంలో సంఘాలను నడపాలని సూచించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, ఏపీఎం సురేశ్, ఎంపీడీవో మహేశ్, సీసీలు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

దోమ మహిళా సమాఖ్యలో మహిళలకు సూచనలు, సలహాలు చేస్తున్న జిల్లాస్థాయి అధికారులు

పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలి

వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మార్చి 27 : జిల్లాలో ధాన్యం కొనుగోలు సెంటర్లను ప్రారంభించడానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యానాయక్ అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో మిల్లర్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో 27, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 61, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 27, ఏఎంసీ ఆధ్వర్యంలో 3, ఇతరములు 4, మొత్తం 122 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రబీ 2023-24కు 1,90,350 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసినట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో పీడీ డీఆర్‌డీఏ శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, వ్యవసాయాధికారి గోపాల్, యూనియన్ అధ్యక్షులు, సంబంధిత అధికారులున్నారు.

ఆర్గానిక్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్

రీజినల్ హెడ్ ఫర్ రీజినల్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫామింగ్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

వికారాబాద్, మార్చి 27 : సహజంగా పండించిన కూరగాయలు, పండ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని రీజినల్ హెడ్ ఫర్ రీజినల్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫామింగ్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం వికారాబాద్ మండలంలోని నారాయణపూర్ రైతు వేదికలో నేషనల్ సెంటర్ ఫర్ ఆర్గానిక్, న్యాచురల్ ఫామింగ్, ఉద్యాన శాఖ వారి సహకారంతో ప్రకృతి వ్యవసాయం, ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులపై రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ జీవామృతం, బీజామృతం, ఘన జీవామృతం తయారీ పద్ధతుల గురించి వివరించారు. సహజంగా ఆర్గానిక్ పద్ధతిలో పండించే రైతులు తక్కువగా ఉన్నారన్నారు. దీని గురించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పరంపరాగత్ కృషి వికాస్ యోజన' కింద రైతులు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడి ఈ కార్యక్రమాలను చేపడితే లాభం పొందవచ్చని సూచించారు. ఆర్గానిక్ సర్టిఫికేషన్ గురించి, రిజిస్ట్రేషన్ పద్ధతిని వివరించారు. 'జైవిక్ కేతి' పోర్టల్ ద్వారా ఆర్గానిక్‌గా పండించే ఉత్పత్తులను రైతులు సొంతంగా విక్రయించవచ్చని ఆయన వివరించారు.

అన్ని రంగాల్లో ముందుండాలి

రైతులు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పడితే కలిగే లాభాలపై జిల్లా ఉద్యాన అధికారి సత్తార్ అవగాహన కల్పించారు. నాగర్ కర్నూలు జిల్లా ఉద్యాన అధికారి చక్రపాణి మాట్లాడుతూ.. వికారాబాద్ రైతు ఉత్పత్తిదారుల సంఘం అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. మామిడి, ఇతర కూరగాయల ఉత్పత్తి పెంచి విదేశాలకు ఎగుమతి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారులు కమల, అబ్దుల్‌గఫూర్, అర్చన, విజయ్‌కుమార్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

మేడిపల్లి-తక్కళ్లపల్లి గ్రామాల మధ్య మార్కింగ్

యాచారం మీదుగా నూతన రైల్వే లైన్

యాచారం, మార్చి 27 : యాచారం మండలం మీదుగా కొత్త రైల్వే లైన్ రానున్నది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తున్నది. దీనికోసం సంబంధిత అధికారులు ప్రాథమిక సర్వే చేపట్టారు. మండలంలోని తక్కళ్లపల్లి-మేడిపల్లి మధ్యలో సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు సర్వే మార్కింగ్‌ను వేశారు. ఇప్పటివరకు ఇక్కడి నుంచి రైల్వే లైన్ లేకపోవడంతో మార్కింగ్‌తో అధికారులు, ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. డోర్నకల్ నుంచి గద్వాల వరకు రైల్వే లైన్ వేయనున్నట్లు సమాచారం. అధికారులు తుది స్థాన (ఫైనల్ లొకేషన్ సర్వే) సర్వేను చేపట్టినట్లు తెలుస్తున్నది. డోర్నకల్ నుంచి ఖమ్మం జిల్లా మోతే, సూర్యాపేట, బీమారం, నల్గొండ, నాంపల్లి, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి, భూత్పూర్ తదితర ప్రధాన ప్రాంతాలను కలుపుతూ రైల్వే లైన్ వేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. మోతేలో ఎస్‌సీపీ 103, యాచారం మండలంలో ఎస్‌సీపీ 93 నంబర్లను మార్కింగ్ చేశారు. మండలానికి శంషాబాద్ ఎయిర్‌పోర్టు దగ్గరగా ఉండటం, ఫార్మాసిటీ ఉండటంతోనే ఇక్కడి నుంచి రైలు మార్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. గతంలో హైదరాబాద్ నుంచి సాగర్ మీదుగా మాచర్లకు రైల్వే లైన్ వేస్తామని అప్పటి కాంగ్రెస్ కేంద్ర మంత్రి హామీ ఇచ్చి నెరవేర్చలేకపోయారు. దీంతో ఎన్నో ఏండ్లుగా ఇక్కడి నుంచి రైలు మార్గం కలగానే మిగిలింది. ప్రస్తుతం నూతనంగా రైలు మార్గం కోసం అధికారులు సర్వే చేయడంతో ఎంతో కాలంగా ప్రజల ఎదురు చూపులకు తెర పడనున్నది.

ఓటు హక్కు వినియోగంపై

ప్రతిఒక్కరికి అవగాహన కల్పించాలి

రంగారెడ్డి డీఆర్డీవో, జిల్లా ఎన్నికల నోడల్ అధికారి శ్రీలత

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌డీవో

ఇబ్రహీంపట్నంరూరల్, మార్చి 27 : ఓటు హక్కు వినియోగంపై తల్లిదండ్రులు, తమ కుటుంబసభ్యులకు అవగాహన కల్పించాలని డీఆర్‌డీవో, జిల్లా నోడల్ ఎన్నికల అధికారి శ్రీలత అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఓటర్ల అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మే 13న జరిగే ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. ఎవరి ఓటు వారికి ఆయుధంగా భావించి ప్రతిఒక్కరూ ఓటు వేసి ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో సూర్యారావు, ఎంపీడీవో వెంకటమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెట్ అర్హత పరీక్ష ఫీజు తగ్గించాలి

వికారాబాద్, మార్చి 27 : టెట్ అర్హత ఫీజు తగ్గించాలని కోరుతూ బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో టెట్ సూపరింటెండెంట్ నాగరాజుకు బుధవారం హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య మాట్లాడుతూ.. గతంలో టెట్ ఒక పేపర్‌కు రూ.200 ఫీజు ఉండగా దాన్ని రూ.1000కి పెంచారని, రెండు పేపర్లు రాసే అభ్యర్థులకు గతంలో రూ.300గా ఉన్న ఫీజును ఏకంగా రూ.2,000 వరకు పెంచారన్నారు. ఇప్పటికే కోచింగ్, శిక్షణ, హాస్టల్ ఫీజులకే వేలకు వేల రూపాయలు ఖర్చుపెడుతున్న అభ్యర్థులకు ఇది భారం కానున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా టెట్‌కు సంబంధించి ఒక్కో పేపర్‌కు వెయ్యి రూపాయల ఫీజు చెల్లించాలి అనడం మూర్ఖత్వమేనన్నారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయబోమని చెప్పి ఇప్పుడు మాట మార్చడం సరికాదన్నారు. ఆన్‌లైన్ పరీక్ష పేరిట వేలకు వేల రూపాయలు వసూలు చేయడం బాధాకరమన్నారు. వెంటనే టెట్ ఫీజు తగ్గించాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు నాగేందర్, అవినాశ్, శ్రీకాంత్, రాకేశ్, క్రాంతి, జాన్, వంశీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదు

షాబాద్, మార్చి 27 : అగ్రికల్చర్ యూనివర్సిటీలో హైకోర్టు శంకుస్థాపన కార్యక్రమాన్ని అడ్డుకుంటామని ప్రభుత్వం భయపడి ముందస్తు అరెస్ట్ చేయడం సరికాదని.. కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోవు రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్ అన్నారు. బుధవారం షాబాద్‌లో ఏబీవీపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు న్యాయం కావాలని ఏబీవీపీ పోరాటం చేస్తే ముందుస్తు అరెస్ట్‌లు చేయడం దారుణమని మండిపడ్డారు. దీంతో ప్రభుత్వానికి విద్యార్థుల పట్ల ఎంత శ్రద్ధ ఉన్నదో అర్థమవుతున్నదన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ విశ్వవిద్యాలయం నాశనానికి ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని తెలిపారు. యూనివర్సిటీ అస్తిత్వం దెబ్బతినేలా, మనుగడ కోల్పోయేలా యూనివర్సిటికీ సంబంధించిన 100 ఎకరాల భూమిని హైకోర్టు నూతన భవనానికి కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు.